# ప్రజలే నా బలం



రాఘవపట్నంలో మాట్లాడుతున్న ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్

- మీ ఆశీర్వాదంతోనే ఈ స్థాయిలో ఉన్న
- మీ నమ్మకాన్ని ఏనాడూ వమ్ము చేయలే
- మళ్లీ దీవించండి.. ప్రాణం ఉన్నంత వరకూ మీతోనే ఉంటా
- కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతం
- 60ఏండ్లు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు
- ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్
- గొల్లపల్లిలో ప్రజా ఆశీర్వాద యాత్ర

గొల్లపల్లి, నవంబర్ 4: 'ధర్మపురి ప్రజలే నా బలం. నా బలగం. మీరు పెట్టిన భిక్షతోనే ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉన్న. చీఫ్‌విప్‌గా, మంత్రిగా ఎదిగినా మీలో ఒకడిగా ఉన్న. ఆపదొస్తే ఆదుకున్న. కష్టాల్లో తోడున్న. నాపై మీరు పెట్టుకున్న నమ్మకాన్ని ఏనాడూ వమ్ముచేయలే. మరోసారి దీవించండి. నా ప్రాణం ఉన్నంత వరకూ మీకు సేవ చేస్తూనే ఉంటా' అని ప్రజలకు ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ విజ్ఞప్తి చేశారు. గొల్లపల్లి మండలం రాఘవపట్నం, గంగదేవిపల్లె, మల్లన్నపేట, వెంగళాపూర్ గ్రామాల్లో శనివారం ఆయన ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టగా, ఊరూరా మహిళలు ఘన స్వాగతం పలికారు. ఆయాచోట్ల గ్రామాల్లో వీధివీధినా తిరిగి, ప్రజలను కలిసి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం రాఘవపట్నం సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ రాష్ర్టాన్ని కాంగ్రెస్ అరవై ఏండ్లు పాలించి చేసిందేమీ లేదని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమం పట్టని పార్టీ, ఇప్పుడు మరొక అవకాశం ఇవ్వాలని, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అప్పుడు చేయనోళ్లు.. ఇప్పుడు చేస్తరా..? ఒకసారి ఆలోచించాలని కోరారు. ప్రజలను మోసం చేయడానికే కొత్త ఎత్తులు వేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు కరెంట్ లేదు, విత్తనాలు, ఎరువులు అందలేదని, ఎరువుల బస్తాల కోసం చెప్పులు లైన్లలో పెట్టాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఆనాడు ₹200కు మించి పింఛన్ ఇవ్వని వాళ్లు.. ఇప్పుడు ₹4వేలు ఇస్తానంటే నమ్ముదామా..? ఒకసారి ఆలోచించాలని కోరా రు. వాళ్ల మాటలు నమ్మితే బతుకులు ఆగమైపోతాయని, మళ్లీ పాత కథే పునరావృతమవుతుందని చెప్పారు. ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు కేసీఆర్ సీఎంగా ఉన్నందునే మన అవసరాలను గుర్తించి అడుగకుండానే అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రైతు బాగున్న చోటే రాజ్యం బాగుంటుందని భావించి, 24 గంటల కరెంట్, సాగునీరు అందిస్తున్నారని, అలాగే రైతు బంధు, రైతు బీమాను అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. మిషన్ కాకతీయ ద్వారా 46 వేల చెరువులను పునరుద్ధరించుకున్నామని, వృథాగా పోతున్న వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించుకుని సాగును స్థిరీకరించినట్లు పేర్కొన్నారు. ఇక్కడ సర్పంచ్‌లు రాగం శంకరయ్య, సుజాత, నర్సయ్య, రమ్యా, ఎంపీటీసీ మధుకర్ రెడ్డి, రాజన్న ఎంపీపీ శంకరయ్య, జడ్పీటీసీ జలంధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మాండ్లు, వైస్ చైర్మన్ లింగా రెడ్డి, పాక్స్ అధ్యక్షులు రాజ సుమన్ రావు, మాధవ రావు, నాయకులు తిరుపతి గౌడ్, అశోక్ రావు, జలంధర్, మల్లా రెడ్డి, కిషన్, సత్యం ఉన్నారు.

### మీ సేవ కోసమే ఈ జీవితం

'నేను ఏ పదవిలో ఉన్నా మీకు అందుబాటులోనే ఉన్నా. మీ సేవ కోసమే ఈ జీవితం. ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచా. ఈ ఎన్నికల్లో గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తా. నన్ను భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గంలోని దళితులందరికీ ఒకేసారి దళితబంధు ఇస్తామని ఇటీవల ధర్మపురి సభలో సీఎం కేసీఆర్ ప్రకటించడం ఆయన మంచితనానికి నిదర్శనం. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్ రూ.5016కు పెరుగుతుంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు అమ లు చేస్తున్న సంక్షేమ పథకాలు, కొత్తగా ప్రకటించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను చూసి ఓటేయాలి' అని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలను కోరారు.



చొప్పదండిలో మాట్లాడుతున్న అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

# బీఆర్ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి

- బీఆర్ఎస్ చొప్పదండి అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- 4, 5, 6వ వార్డుల్లో ప్రచారం

చొప్పదండి, నవంబర్4: బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. చొప్పదండి మున్సిపల్ పరిధిలోని 4,5,6వ వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డుల్లోని ప్రతి గడపగడపకూ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ, ఎన్నికల మ్యానిఫెస్టోపై అవగాహన కల్పిస్తూ ఓటు అభ్యర్థించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.100కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించి చొప్పదండి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నానని చెప్పారు. తనను ప్రజలు ఆదరించి మరోమారు గెలిపిస్తే సేవకుడిలా పనిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చొప్పదండి బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రచారంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్, జడ్పీటీసీ మాచర్ల సౌజన్య-వినయ్, సింగిల్‌విండో చైర్మన్లు వెల్మ మల్లారెడ్డి, మినుపాల తిరుపతిరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, వైస్‌చైర్మన్ చీకట్ల రాజశేఖర్, మాజీ ఎంపీపీలు గుర్రం భూమారెడ్డి, వల్లాల కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు మాడూరి శ్రీనివాస్, మహేశుని సంధ్య-మల్లేశం, వడ్లూరి గంగరాజు, సర్పంచులు పెద్ది శంకర్, విద్యాసాగర్‌రెడ్డి, గుంట రవి, వెల్మ నాగిరెడ్డి, చిలుక లింగయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి,మండల కోఆప్షన్ పాషా, నాయకులు బందారపు అజయ్‌కుమార్‌గౌడ్, వెంకటరమణారెడ్డి, నారాయణ రావు, గాండ్ల లక్ష్మణ్ , పెద్దెల్లి అనిల్, రాపెల్లి ఐలయ్య, పంతంగి ప్రభాకర్, గుర్రం హన్మంత రెడ్డి, కొత్తూరి నరేశ్, నేరెళ్ల అంజయ్య, మహిళలు పాల్గొన్నారు.

# అప్పడెట్లుండే.. ఇప్పడెట్లయింది



ఇటిక్యాల మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజేందర్‌గౌడ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్‌కుమార్, పక్కన ఎమ్మెల్సీ ఎల్ రమణ

- నాడు కష్టాలు, కన్నీళ్లు తప్ప సంతోషం ఉన్నదా..?
- స్వరాష్ట్రంలోనే సంక్షేమ పాలన
- మరొకసారి ఆశీర్వదించండి
- జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డా. ఎం సంజయ్‌కుమార్
- మైతాపూర్, ఇటిక్యాలలో ఎమ్మెల్సీ రమణతో కలిసి ప్రచారం

రాయికల్, నవంబర్4: 'తెలంగాణ రాకముందు గ్రామాలు గ్రామాలు ఎట్లుండె. ఇప్పుడెట్ల ఉన్నయి. నాడు కరెంట్ ఉన్నదా..? నీళ్లు ఉన్నయా..? అభివృద్ధి ఉందా..? సంక్షేమం ఉన్నదా..? మీ ముఖాల్లో సంతోషం ఉన్నదా..? ఏదీ లేదు. కానీ స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఇంటింటికీ సంక్షేమం, ఊరూరా అభివృద్ధి కార్యక్రమాలతో సబ్బండవర్గాల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. ఇవ్వాళ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది' అని జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డా. ఎం సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం రాయికల్ మండలం మైతాపూర్, ఇటిక్యాల గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎల్. రమణతో కలిసి విస్తృత ప్రచారం చేశారు. అనంతరం మైతాపూర్‌లో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పేవన్నీ అబద్ధాలేనని, నమ్మితే మోసపోతారన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలను పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేశానని, రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ తనకు మద్దతు పలికి మరొకసారి ఆశీర్వదించాలని కోరారు. మైతాపూర్‌లో ఈ పదేళ్ల కాలంలో రూ.41.45 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. గ్రామంలో 982 మందికి ఆసరా పథకం కింద 884 మందికి రైతుబంధు, ఏడుగురికి రైతు బీమా, 130 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా లబ్ధి కలిగినట్లు చెప్పారు. ఇటిక్యాలలోనూ రూ.64.60 కోట్లతో అభివృద్ధి చేశామని, గ్రామంలో ఇప్పటివరకు 1413 మందికి ఆసరా పెన్షన్, 2210 మందికి రైతుబంధు, 8 మందికి రైతు బీమా, 227 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అందించినట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ రమణ మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే సంజయ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ సర్పంచులు అజారుద్దీన్, సామల లావణ్య వేణు ఉన్నారు.

### జోరుగా చేరికలు

ఇటిక్యాలకు చెందిన గౌడ సంఘ నాయకులు, 50 మంది యువకులు, 150 మంది మహిళలు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పోతవేణి రాజేందర్ గౌడ్, మైనార్టీ నాయకులు పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కుమ్మరిపల్లికి చెందిన ఉప్పుమడుగు సింగిల్ విండో డైరెక్టర్ సంకె దీనతోపాటు 50 మంది మహిళలు, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 30 మంది యువకులు ఎంపీటీసీ దొంతి నాగరాజు, పార్టీ గ్రామ మహిళ అధ్యక్షురాలు పావని ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ధర్మాజీపేట వార్డు సభ్యులు బాణావత్ రాజేందర్ నాయక్, రాజేశం, రాజేందర్ యాదవ్, పది మంది కాంగ్రెస్ నాయకులు ఎంపీపీ సంధ్యారాణిసురేందర్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్యే డా. సంజయ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



మాట్లాడుతున్న ట్రస్మా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు

# ప్రైవేట్ టీచర్లపై బురద జల్లొద్దు

- రాజకీయ కోణంలో ఆలోచించవద్దు
- తాము ఎవరి కోసం సమావేశాలు పెట్టడం లేదు
- రాష్ట్రవ్యాప్తంగా టీచర్లకు శిక్షణ ఇస్తున్నాం
- మల్యాలలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు

మల్యాల, నవంబర్ 4: 'ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయులకు ఏటా ఇస్తున్నట్టే ఈ సారి ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తాము ఏ ఒక్క రాజకీయ నాయకుడి కోసం సమావేశాలు నిర్వహించడం లేదని తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్య (ట్రస్మా) సంఘం అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు పేర్కొన్నారు. శనివారం మల్యాలలో విలేకరులతో మాట్లాడారు. మల్యాల, కొడిమ్యాల మండలాల్లోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయులకు నూతన మెళకువలు, బోధన పద్ధతులపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించామని, ఉన్నతాధికారుల ప్రత్యేక అనుమతి కూడా తీసుకున్నామని చెప్పారు. అయితే కొన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాల మనోభావాలు దెబ్బతినేలా ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం సరికాదని, అందుకే శిక్షణ కార్యక్రమాన్ని రద్దు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఈ శిక్షణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నామని, ఇప్పటికే వరంగల్, కరీంనగర్‌లాంటి జిల్లాలో పూర్తిచేసినట్లు చెప్పారు. కానీ ఈ రోజు పలు పార్టీల నాయకులు తమ సంఘ సభ్యులపై చేసిన దుష్ప్రచారంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని, ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో చూడవద్దని సూచించారు. మా ఉపాధ్యాయుల సమావేశాలకు రాజకీయ రంగు పూయడం సరికాదని, ఇకనైనా అటువంటి వ్యక్తులు మారకపోతే ట్రస్మా తరపున సైతం న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సైతం తమ సంఘ సభ్యుడేనని, కానీ అతని కోసం సమావేశాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం తమకు లేదని తేల్చి చెప్పారు. తాము ఆయన విజయంలో భాగస్వామ్యులవుతాము కావచ్చు కానీ, అతని కోసం సమావేశాలను మాత్రం ఏర్పాటు చేయడం లేదని స్పష్టం చేశారు. ఇక్కడ పోకల నరేష్, విశ్వనాల దయానంద్, ప్రతాప కిషన్‌రావు, అనిల్‌కుమార్ బొద్దు, మహేశ్, రాజురావు ఉన్నారు.